క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ప్రాధాన్యం

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్‌గా చందన నాగేశ్వర్ నియమితులైన నాటి నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని స్థానిక సచివాలయం–2 కన్వీనర్ తలారి వరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ ఏ కార్యకర్త కుటుంబం ఆపదలో ఉన్నా పార్టీ పరమైన భరోసానిస్తూ చందన సొంత నిధులతో ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులకు జీవిత బీమా అమలు చేసే బాధ్యతను స్వయంగా నాగేశ్వర్ తీసుకొని భద్రత కల్పించారన్నారు. నాయకులు షట్టర్ బాషా, సాధనాల చంద్రశేఖర్, పేర్ల దుర్గాప్రసాద్, చాటకాల చంటి, బర్రి సుబ్బారావు, హమీద్ బాషా, రేగుళ్ల రఘు, పందెళ్ల భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తులకు ఎంపీ పరామర్శ



గుత్తుల మురళీధరరావును పరామర్శిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: మాతృ వియోగంతో బాధపడుతున్న 50వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర అదనపు కార్యదర్శి గుత్తుల మురళీధరరావును ఎంపీ మార్గాని భరత్‌రామ్ పరామర్శించారు. గురువారం మురళీధరరావు మాతృమూర్తి గుత్తుల సూరమ్మ (82) తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు ఎంపీ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు ఉన్నారు.

ఘనంగా సంస్కృత దినోత్సవం

ప్రకాశంనగర్: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సంస్కృత దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దీనికి ప్రముఖ విద్వాంసుడు ప్రభల సుబ్రహ్మణ్యశర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ భాష అయినా అందులో ఉన్న సాహిత్యం వల్ల పరిపుష్టం అవుతుందన్నారు. యోగా సాధనతో శారీరక, మానసిక రుగ్మతలు నయమవుతాయన్నారు. దీనికి కళాశాల ప్రిన్సిపల్ పి.రాఘవకుమారి అధ్యక్షత వహించగా వైస్ ప్రిన్సిపల్ రత్నకుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.అనురాధ, సంస్కృత ఉపన్యాసకురాలు ఆర్.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల నిరసన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రిజిస్ట్రేషన్లను పాత పద్ధతిలోనే చేయాలని మండల దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం మోరంపూడి జంక్షన్‌లోని పిడింగొయ్యి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి, నగర అధ్యక్షుడు దుర్గా ఫణికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం దిగొచ్చే వరకూ ఆందోళన కొనసాగిస్తామన్నారు. సంఘ నాయకులు పోతల శ్రీనివాసరావు, వీఎస్ ఫణి, సమ్మెట్ల చంద్రశేఖర్, దోనబోయిన వాసు పాల్గొన్నారు. అలాగే స్థానిక అనుశ్రీ థియేటర్ సమీపంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద కూడా పెన్‌డౌన్ కార్యక్రమం కొనసాగింది.

టీడీపీ నేతల పాదయాత్ర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు 200 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకూ పాదయాత్ర చేపట్టారు. కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మజ్జి పద్మావతి, అన్నందేవుల చంటి, మత్సేటి ప్రసాద్, వెలుగుబంటి రఘురామ్ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	ఖుషి
సూర్యమినీ	బెదురులంక 2012
సూర్యప్యాలెస్	దిఈక్వలైజర్-3
స్వామి	ఖుషి
శివజ్యోతి	ఖుషి
అనుశ్రీ	ఖుషి
రాజా	ఖుషి
అశోక	జైలర్
ఊర్వశి	గాండీవధారి అర్జున
రంభ	భోళాశంకర్
మేనక	బాయ్స్ హాస్టల్, భూతాల బంగ్లా
గీతాఅప్సర	బెదురులంక 2012
నామవరం	
విఎస్.మహల్	ఖుషి
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	ఖుషి
కడియం	
వెంకటసూర్య	ఖుషి

అంతర పంట... ఆదాయమేనంట

- విభిన్న రకాల సాగుపై నర్సరీ రైతుల దృష్టి
- సేంద్రియ విధానానికీ ప్రాధాన్యం



కడియం మండలంలో అరటి తోటలో వేసిన అంతర పంటలు

కడియం: ప్రణాళిక ఉంటే ఏ రంగంలోనైనా పసిడి కాంతులే.. వ్యవసాయంలో సస్యరక్షణతో పాటు సరికొత్త విధానాలతో సాగితే లాభాల పంటే.. ఇక్కడి రైతులు సేంద్రియ విధానంలో సాగు, అంతర పంటల విధానాన్ని రైతులు అవలంబిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. తద్వారా లాభాలు పొందుతున్నారు. కొబ్బరి తోటల్లో ఆర్కే ఫామ్స్, ఫాక్స్ టైల్స్ వంటి అలంకరణ మొక్కల ప్యాకెట్లను ఏర్పాటు చేసి అటు కొబ్బరి ఆదాయాన్ని, ఇటు మొక్కల ద్వారా వచ్చే లాభాలు అందుకునే ప్రయత్నం చేస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అలాగే రసాయనిక ఎరువుల భారాన్ని తగ్గించుకుంటూ సేంద్రియ విధానంలో పేడ, వర్మి కంపోస్టు వంటి సంప్రదాయేతర ఎరువులను నర్సరీ మొక్కలకు అందిస్తున్నారు. తద్వారా నేలసారాన్ని కాపాడుకోవడంతో పాటు గణనీయంగా పెట్టుబడిని తగ్గించుకుంటున్నారు. కడియం రూరల్ మండలంలో సుమారు 7,500 హెక్టార్లలో నర్సరీ రంగం విస్తరించి ఉంది. వందేళ్ల చరిత్ర ఉన్న ఈ రంగంలోని వారంతా ముందు తరాల అనుభవంపైనే మొక్కలను పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో షేడ్ నెట్‌లో సాగు చేసే మొక్కలను ఇక్కడి రైతులు కొబ్బరి తోటల్లో సాగు చేస్తున్నారు. ఎకరాల విస్తీర్ణంలో షేడ్ నెట్‌ను ఏర్పాటు చేయాలంటే రూ.లక్షల పెట్టుబడులు అవసరం. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు కొబ్బరి చెట్ల నీడను రైతులు వినియోగించుకుంటున్నారు. ఎకరా కొబ్బరి తోటలో మీడియం సైజు మొక్కల బ్యాగులను 5 వేల వరకూ ఏర్పాటు చేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. చిన్న సైజు అయితే మరిన్ని ఎక్కువగా పెట్టుకోవచ్చని తెలిపారు. ఎకరా కొబ్బరి తోటను చెట్లతో సహా కౌలుకు తీసుకుంటే రూ. 55 వేల నుంచి రూ. 75 వేల వరకు ఉంటుంది. అదే కొబ్బరి కాయలను భూమి సొంతదారుడు తీసుకునేలా అయితే రూ. 25 వేల నుంచి రూ. 35 వేల వరకు కౌలు చెల్లిస్తున్నారు. తోటల్లో ఆర్కే ఫామ్స్, మనీ ప్లాంట్, ఫాక్స్ టైల్ ఇండోర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. అరటి తోటలో లక్ష్మణఫలం వంటి మొక్కలను కూడా పెంచుతున్నారు. ఈ రకాల మొక్కలు వేసవి ఎండల తీవ్రతకు పాలిపోతాయి. నీడలో పెరిగితే పచ్చదనంతో కళకళలాడుతాయని దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నర్సరీ రైతు గాజుల రత్తయ్య వివరించారు.

ఖర్చులు తగ్గించుకునేందుకు..

కడియం ప్రాంత నర్సరీల్లో సాగయ్యే మొక్కల రకాలు వందల్లోనే ఉంటాయి. అలంకరణ, పండ్లు, పువ్వులు విభాగాల్లో ప్రతి ఒక రకానికి పదికి పైగా మొక్కలు ఇక్కడ లభిస్తాయి. దేశ, విదేశాల్లో విభిన్న రకాల మొక్కలను సేకరించి తీసుకువచ్చి ఇక్కడి రైతులు వాటిని అభివృద్ధి చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలు, వాతావరణ పరిస్థితుల నుంచి ఇక్కడికి తీసుకుచ్చిన పలు రకాల మొక్కలకు రసాయనిక ఎరువులు, పురుగు మందులను తగు మోతాదులో అందించాల్సిందే. ఈ నేపథ్యంలో రైతులపై ఆ మేరకు భారం పడుతుంది. కాగా ప్రస్తుతం రైతులు సేంద్రియ సాగుపై దృష్టి పెడుతున్నారు. వివిధ రకాల మొక్కలకు పేడ, వర్మికంపోస్టును అందిస్తూ పెట్టుబడులను తగ్గించుకుంటున్నారు. కొన్నేళ్లుగా కూలి ఖర్చులు, ఇతర పెట్టుబడులు పెరిగినప్పటికీ మొక్క ధర మాత్రం తగ్గుతోంది. దీంతో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. సేంద్రియ విధానం వారికి వరంగా మారింది. కొబ్బరి, పంపరపనస, జామ, మామిడి వంటి పండ్ల జాతి మొక్కలతో పాటు, ఫాక్స్ టైల్, ఆర్కే ఫామ్స్ వంటి అలంకరణ మొక్కలకు పేడను ఎరువుగా వినియోగిస్తున్నారు. దీంతో మొక్క ఏపుగా పెరగడంతో పాటు, పురుగు మందులు కొట్టే అవసరం కూడా తగ్గుతోందని బుర్రిలంకకు చెందిన నర్సరీ రైతు పోలిశెట్టి బాపయ్య తెలిపారు.

బంధాలను పటిష్టం చేసుకోవాలి



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న సంఘ మిత్ర సభ్యులు

సీటీఆర్ఐ: ఆధునిక సమాజంలో బాంధవ్యాలను పటిష్ట పరిచేదే రాఖీ పౌర్ణమి అని లయన్స్ క్లబ్ సంఘమిత్ర నగర అధ్యక్షుడు రౌతుల స్వామి అన్నారు. రక్షాబంధన్ పండగను పురస్కరించుకుని గురువారం సంఘమిత్ర క్లబ్ తరఫున వృద్ధులకు భోజన వితరణ చేశారు. కొంతమూరు శానిటోరియంలోని సెయింట్ జాన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామి వృద్ధులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి పండగలోనూ పరమార్థం ఉంటుందన్నారు. పండగలు చేసుకోవడమే కాకుండా వాటి విలువలను పాటించాలన్నారు. వృద్ధులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని క్లబ్ సెక్రటరీ యార్లగడ్డ చిట్టిబాబు అన్నారు. క్లబ్ సభ్యుడు శ్రీనివాసరావు, హరిత దళం స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పి.వెంకటేశ్వరరావు, ఎం.శివ సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురద జల్లడం మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీకి రాష్ట్రంలో మనుగడ లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని అదేపనిగా విమర్శిస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తుందని వైఎస్సార్ సీపీ నాయకుడు, రాజమహేంద్రి విద్యా సంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధిని చూడలేక విమర్శలు చేయడమే లక్ష్యంగా ఆ పార్టీ పెట్టుకుందన్నారు. కొందరు కులసంఘాల నాయకులే తమ సత్తా చూపిస్తామంటూ ప్రగల్భాలు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. కుల మతాలు ప్రామాణికంగా ఓట్లు వేసే రోజులు ప్రజాస్వామ్యం వ్యవస్థలో లేదని అన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు దొంగ ఓట్లు అని గగ్గోలు పెట్టడం మానుకోవాలని హితవు పలికారు. ఓటరు కార్డును ఆధార్‌కు అనుసంధానం చేస్తే దొంగ ఓట్ల బెడద ఉండదని అందరూ స్పందించాలన్నారు.

అనాథ పిల్లల సంరక్షణకు చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు: స్థానిక ప్రకాష్‌నగర్ సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అనాథ పిల్లల సంరక్షణ, విద్యా చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి మాట్లాడుతూ అనాథ పిల్లలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్ల బాధింపబడుతున్న పిల్లలు కనిపించినప్పుడు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, పోలీసులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలపాలన్నారు. పిల్లల పట్ల అమానుషంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. పిల్లలతో భిక్షాటన చేయించడం, లైంగిక దాడులు చేయడం, వెట్టిచాకిరీ, బాల్య వివాహాలు వంటి సమస్యలను పూర్తి నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి కె.విజయకుమారి మాట్లాడుతూ పిల్లల హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం సెంట్రల్ జైలులోని ప్రత్యేక మహిళా కారాగారాన్ని న్యాయమూర్తి ప్రత్యూష కుమారి సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించిన అనంతరం ఖైదీలతో మాట్లాడారు.

హరే రామ హరే కృష్ణ



ఇస్కాన్‌లో జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు మహాభిషేకం చేస్తున్న పూజారులు

సీటీఆర్ఐ: స్థానిక ఇస్కాన్ మందిరంలో బలరామ జయంతి సందర్భంగా గురువారం జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు మహాభిషేకం నిర్వహించారు. సాయంత్రం హోమం జరిగింది. కమిటీ చైర్మన్ శ్రీశ్యామంగా నిమయదాసు, కమిటీ సభ్యులు శివానంద నిమయదాసు, హేమ నిమయదాసు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఉదయం బలరామ జయంతిని నిర్వహించారు. మందిరంలో శ్రీత్రిదండి స్వామి భక్తి కంకణ బన మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తిశ్రద్ధలతో గోపూజ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం నుంచి రోజూ రాత్రి 7.30 నుంచి 9 గంటల వరకు శ్రీభాగవతాచార్యులు, శ్రీపాద సురేష్ బ్రహ్మచారిచే శ్రీమద్ భాగవత ఉపన్యాసం జరుగుతుందని ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. రోజూ ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో గోశాల ట్రస్టు చైర్మన్, గోకుల్ టీవీఎస్ షోరూం అధినేత ఎస్‌వీఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతాలు



సరస్వతి ఘాట్‌లో సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

సీటీఆర్ఐ: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని స్థానిక సరస్వతి ఘాట్‌లో సత్యనారాయణ స్వామివారి వ్రతాలు ఉచితంగా నిర్వహించడం ఆనందదాయకమని జిల్లా ధార్మిక కమిటీ సభ్యుడు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోట సుబ్బారావు అన్నారు. గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, జిల్లా ధార్మిక కమిటీ అధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా భక్తులు స్వామివారి వ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా పర్వదినాల్లో సరస్వతి ఘాట్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ సత్యనారాయణ స్వామివారి ఆశీస్సులు అందరికీ ఉండాలని, ఈ వేడుకలలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. టీటీడీ జిల్లా ధార్మిక కమిటీ సభ్యుడు కాలెపు సతీష్, టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఓరుగంటి నరసింహ యోగి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సమరభేరి

ప్రకాశంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చేపట్టిన సీపీఎం సమరభేరి కార్యక్రమం గురువారంతో రెండో రోజుకు చేరుకుంది. స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద ప్రయాణికులకు కరపత్రాలు అందించడంతో పాటు సంతకాల సేకరణ చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పార్కు పనులు పూర్తి చేయండి



ఏకేసీ కళాశాల వద్ద పార్కులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఏకేసీ కళాశాల సమీపంలో పార్కును సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆ పార్కును అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్క్‌లో వాకింగ్ ట్రాక్‌ను వెంటనే అందుబాటులో తేవాలన్నారు. అదనంగా చేపట్టిన ఫుడ్ కోర్టు, డయాస్, పాత్ వే, సెల్ఫీ పాయింట్ వంతెన వంటి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కంబాలచెరువు పార్కును సందర్శించి మిగిలిన పనులను పూర్తి చేయాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండు రంగారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అనుసంధాన రోడ్లను గుర్తించండి

తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి జాతీయ రహదారికి అనుసంధానిస్తూ నిర్మిస్తున్న 100 అడుగుల రహదారికి అనుసంధానమయ్యే అంతర్గత రోడ్లను గుర్తించి అభివృద్ధి చేయాలని అధికారులను కమిషనర్ కె.దినేష్‌కుమార్ ఆదేశించారు. మోరంపూడి రోడ్డు విస్తరణ, శ్రీవెంకటేశ్వర జనరల్ మార్కెట్, వంద అడుగుల రహదారిని అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. వెంకటేశ్వర జనరల్ మార్కెట్ నుంచి ఆవలో ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రం వరకూ ఉన్న పాత కాలువను పునరుద్ధరించి ఎప్పటికప్పుడు వాహనాలతో మురుగును తొలగించడానికి వీలుగా బండ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. షెల్టాన్ హోటల్ నుంచి ఆవ వాంబే కాలనీ వరకూ కాలువ ఏర్పాటు చేయాలన్నారు. సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఎంపీ భరత్ భరోసా



నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది సమస్యలపై ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ హామీ ఇచ్చారు. గురువారం రాత్రి స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఆయన్ని నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ సిబ్బంది కలసి వారి సమస్యలు వివరించారు. మూడు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేసి, న్యాయం చేయాలని ఎంపీ భరత్‌కు మొరపెట్టుకున్నారు. మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని సీఎం జగన్ ప్రకటించారని, దీనిపై ఈ నెల 7న రాజమహేంద్రవరం వచ్చిన సీఎంకు ఎంపీ భరత్ సహకారంతో వినతిపత్రం కూడా అందజేసినట్టు ఇంజినీరింగ్ సిబ్బంది ఎస్.ఏసుబాబు, సిరికి ప్రసాద్, బుంగా ఏసయ్యరాజు తదితరులు తెలిపారు. సీఎం జగన్ వెంటనే కలెక్టర్‌కు సమగ్ర విచారణ చేసి నివేదిక పంపమన్నారని, కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌కు పంపారని తెలిపారు. ఈ సమయంలో ఎంపీ భరత్ జోక్యం చేసుకుని తగు న్యాయం చేసేలా అధికారులకు సూచించాలని కోరేందుకు ఇక్కడకు వచ్చామని తెలిపారు. వీరి సమస్యలను పూర్తిగా విన్న ఎంపీ భరత్ సానుకూలంగా స్పందించారు. మీ సమస్య నాదిగా భావించి.. తగు న్యాయం జరిగే వరకూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నగరపాలక సంస్థలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వీధి దీపాల సెక్షన్ తదితర ఇంజినీరింగ్ సిబ్బంది మొత్తం 182 మంది ఉన్నారు. అయితే 2014 నుంచి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే వారిని పర్మినెంట్ చేస్తామని సీఎం జగన్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాకపోతే అంతకు ముందు నుంచీ కూడా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహించే వారిని కూడా పర్మినెంట్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో న్యాయం చేయమని ఎంపీ భరత్‌ను తాము కోరినట్టు మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు.

పథకాలతో పేదలకు లబ్ధి

- పార్టీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్
- కాతేరులో గడప గడపకూ..



ప్రభుత్వ పథకాల గురించి లబ్ధిదారుకు వివరిస్తున్న పార్టీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదలందరికీ లబ్ధి చేకూరుతుందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. గురువారం కాతేరు గ్రామ సచివాలయం–2 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరిస్తూ, సమస్యలను తెలుసుకున్నారు. నాగేశ్వర్ మాట్లాడుతూ అర్హులందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో 98 శాతం అమలు చేశారని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. వేగివారి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినందుకు చందన నాగేశ్వర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. హైస్కూల్ ప్రాంతంలో రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సదుపాయం కల్పించాలని ప్రజలు అడగ్గా చందన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలన్నారు. సచివాలయ కన్వీనర్లు కొత్తపల్లి నాగేశ్వరరావు, పెనుమాక సునీల్, మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు, సొసైటీ అధ్యక్షుడు ఆచంట కళ్యాణ్, యెజ్జు వాసు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం

సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ఆ పార్టీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక 39వ డివిజన్ లింగంపేటలో పార్టీ డివిజన్ ఇన్‌చార్జి లంక ప్రసాద్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను గూడూరి శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని పక్షంలో తెలియజేస్తే తక్షణమే చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. లింగంపేట ఐదో వీధిలో ఉన్న ఫిష్ మార్కెట్, రైతు బజార్‌గా మార్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు తెలపగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇళ్ల పట్టాలకు సంబంధించి హామీ పత్రాలు ఇచ్చిన వారికి త్వరలో పట్టాలు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, శ్రీ గౌతమి జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, కొత్త విజయరాజ్యలక్ష్మి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ నింపుతుండగా ప్రమాదం



అగ్ని ప్రమాదంతో కాలిపోయిన ప్రాంతం

కడియం: డబ్బాలో తీసుకువచ్చిన పెట్రోల్‌ను బాటిళ్లలో నింపుతుండగా మంటలు వ్యాపించి ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం కడియపుసావరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కడియపుసావరం గ్రామానికి చెందిన బొమ్మిడి క్రాంతికుమార్ (48) అహా ట్రేడర్స్ పేరుతో కిరాణా అండ్ జనరల్ స్టోర్స్ నిర్వహిస్తున్నాడు. గురువారం పెట్రోల్ బంకు నుంచి డబ్బాలో పెట్రోలు కొనుగోలు చేసి షాపునకు తీసుకువచ్చాడు. షాపు వద్ద డబ్బాలోని పెట్రోల్‌ని లీటర్, అర లీటర్ బాటిళ్లలో నింపుతుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో క్రాంతికుమార్ తల నుంచి పొట్టవరకూ కాలిపోయింది. అంతేకాకుండా పరిసర ప్రాంతంలోని సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. తీవ్ర గాయాలైన క్రాంతికుమార్‌ను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కడియం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అంతేకాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా, అనధికారికంగా పెట్రోలు అమ్మకాలు జరపడంతో వీఆర్వో ఫిర్యాదు మేరకు బొమ్మిడి క్రాంతికుమార్‌పై కడియం పోలీసులు కేసు నమోదు చేశారు.

తోరాటికి జెడ్పీ చైర్మన్ పరామర్శ

ధవళేశ్వరం: సతీ వియోగంతో బాధపడుతున్న పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు తోరాటి ప్రభాకరరావును గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పరామర్శించారు. ఇటీవల ప్రభాకరరావు సతీమణి విజయలక్ష్మి మృతి చెందారు. ఈ మేరకు ఆయన్ని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), టీడీపీ నాయకుడు కొత్తూరి బాలనాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

'గిడుగు' పురస్కారం ప్రదానం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ తరపట్ల సత్యనారాయణకు తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు పురస్కారం లభించింది. యూనివర్సిటీలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడంతో పాటు తెలుగు భాష, సంస్కృతీ సాహిత్యాల అభివృద్ధికి కృషి చేసిన ఆయన తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ విజయవాడలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. దీనికి సంబంధించిన జ్ఞాపికను డాక్టర్ తరపట్లకు అందజేస్తూ 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు అభినందనలు తెలిపారు. డాక్టర్ ఎస్.కిరణ్‌చంద్ర, డాక్టర్ ఎస్.రాజశేఖర్, డాక్టర్ ఆర్.జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ పుస్తకావిష్కరణ

నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.వెంకట్రావు, మరికొంత మంది అధ్యాపకులతో కలసి రచించిన బీఎస్సీ పాఠ్య పుస్తకాన్ని వీసీ పద్మరాజు ఆవిష్కరించారు.

సంచార వర్గాల అభివృద్ధికి నిధులు



సంచార జాతుల పెద్దలను సత్కరించిన బీజేపీ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ పంచాయతీ వెంకటగిరి గంగిరెద్దుల కాలనీలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్‌వీబీఎస్ ఆచారి అధ్యక్షతన గురువారం సంచార జాతుల విముక్త దివాస్ నిర్వహించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీశ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జి కురగంటి సతీష్, రూరల్ కన్వీనర్ యానాపు యేసు పాల్గొని సంచారజాతి పెద్దలు ఉగ్గం పుత్రయ్య, బొడ్డు సింహాద్రి, ఎద్దు పగిడియ్య, బొడ్డు పుత్రయ్య, పొట్టియ్యలకు చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమాలను గ్రామాల్లో ఇంటింటికి తీసుకెళ్తున్న సంచార సమాజంపై బ్రిటీష్ ప్రభుత్వం కుట్ర పూరితంగా విధించిన అక్రమ చట్టాల నుంచి 1952 ఆగస్టు 31న విముక్తులను చేసిన రోజును సంచార సమాజం విముక్త దివాస్‌గా నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ సంచార వర్గాలకు అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి నిధులు ఇచ్చారన్నారు. నాయకులు మరకాని సతీష్ , మట్టాడి వరప్రసాద్, సిద్ధాని వెంకట్, పట్నాల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.